అసమర్థుడి పరిశోధన!

ఏ. వీ. మోహన్రావ్

ఆఫీసురూంలో కూర్చుని హాయిగా సిగరెట్ పొగ పీలుస్తూ, క్రైమ్‌మాగజైన్ చదువుతున్నాను.

ప్రొద్దుట్నించి విడవకుండా పడుతుంది వర్షం.

దూరంగా టక్కు టక్కు మంటూ మెల్లిగా ఒకదాని వెంటపడుతున్న అడుగులశబ్దం వినవచ్చింది. మరో నిముషానికి ఆ శబ్దం నా గదిముందుదాకా వచ్చి ఆగింది. మరుక్షణం తలుపుమీద వ్రేలితో తట్టిన శబ్దమైంది.

"తలుపు తీసేవుంది. తోసుకొని రండి!" అన్నాను.

మరుక్షణం తలుపు తెరుచుకుంది. గుమ్మంలో ఫ్లవర్ ప్రింట్స్‌తోవున్న రెయిన్‌కోట్ తొడుక్కున్న స్త్రీ కనిపించింది.

"నమస్తే!" అందామె.

"ఆ కోటు విప్పి, వెలుపల పెట్టి రండి" అన్నాను.

ఆమె గుమ్మంలో నిలుచుని కోటు తీసింది. దాన్ని లుంగచుట్టి, గది వెలుపలున్న స్టూలుపైన పెట్టి వచ్చింది.

ఆకు పచ్చరంగు షిఫాను చీర, అదేరంగు పాలిస్టర్ జాకెట్ వేసుకుంది. మెళ్ళో సన్నటి బంగారు గొలుసు వుంది. సన్నటి శంఖంలాంటి పొడవుపాటి మెడ, సూటిగా వున్న ముక్కు, పల్చటి పెదాలు, విశాలమైన కళ్ళు, వెడల్పాటి నుదురు, అన్నీ కలిసీ, వెరసి ఆమెను అందంగా తీర్చిదిద్దినట్లనిపించింది.

"కూర్చోండి!" అన్నాను.

ఆమె చీరకుచ్చెళ్ళు సవరించుకుని కూర్చుంది.

"డిటెక్టివ్ సుధాకర్ మీరే కదూ!" అడిగింది ఆమె.

నవ్వుతూ తలూపాను.

"నాకో చిన్నపని చేసిపెట్టడానికి ఒక డిటెక్టివ్ కావలసి వచ్చింది. కొంతమంది ఫ్రెండ్స్‌ను కన్సల్ట్ చేశాను. మీ పేరు చెప్పారు. నాకు తెలివితేటలున్న మనిషికన్నా, నిజాయితీగల మనిషి కావాలి" అంది.

"మీ ఫ్రెండ్స్ అది నాకుందని చెప్పారా?"

"ఊఁ!"

"అంటే తెలివితేటలులేవని వాళ్ళ అభిప్రాయమా?"

"నేనడగలేదు. అయినా వాటితో నాకు పనిలేదు."

"ఇంతకు అసలు విషయం చెప్పలేదు" అంటూ గుర్తు చేసాను.

"నా పేరు లీల. మా వారిపేరు రాజాచంద్ర. ఈ వూళ్ళోవున్న వ్యాపారాల్లో మూడొంతులు మా కుటుంబానివే" అందామె.

"తెలుసు. మీవారి గురించి విన్నాను. కానీ పరిచయం లేదు నాకు."

"అతను చాలా హైసర్కిల్ మనిషి. మామూలుగా

మీలాంటి వాళ్ళకు పరచయంకాడు'' అన్నో అసహ్యపడి క్రింద లెఖగట్టి మాట్లాడే ఆమె తీరు మొదట్నుంచీ నాకు కాస్త అసహ్యంగానే వుంది.

''ఆతని పరిచయం నాకు తిండిపెట్టదు. పోనీండి. ఇంతకూ మీరొచ్చిన విషయం చెప్పండి'' అన్నాను.

''మావారు ఎవరో ఒక స్త్రీ మైకంలో పడిపోయారు. అది ఎన్నాళ్ళనాడు మొదలయిందో నాకు తెలీదు. నా దృష్టికివాళే వచ్చింది. ఆమె ఏదో రహస్యం చేతిలో పెట్టుకొని మావార్ని బెదిరించి డబ్బు గుంజుతున్నట్లుంది. ఆమె ఎవరు? ఆమె మావార్ని ఏ సాకుతో బ్లాక్ మెయిల్ చేస్తూంది కనుక్కోవాలి. అంతే!'' అందామె.

''ఈ విషయం మీవార్ని అడిగితే చెప్పరా?''

''చెప్పడు. పైగా అలాటిదేమీ లేదని బుకాయిస్తాడు.''

''ఆమెతో మీరు మాట్లాడలేక పోయారా?''

''ఆమె ఎవరో నాకు తెలీదు. పైగా తెలుసుకుని మాట్లాడినా, తనకేం తెలీదనో, నా భర్తను తను బ్లాక్ మెయిల్ చెయ్యడంలేదనో బుకాయించవచ్చు. అందువల్ల అది లాభంలేదు'' అందామె.

''అసలు ఎవరో మీవార్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు ఎలా తెలిసింది?'' అడిగాను నేను.

''చాలా విచిత్రంగా జరిగింది. ఇవాళ ఉదయం నా ఫ్రండుకు టెలిఫోన్ చేద్దామని హాల్లోకి వచ్చాను. రిసీవరు తీసుకొని చెవిదగ్గర పెట్టుకున్నాను. ఇయర్ ఫోన్ లో మాటలు వినిపించసాగాయి. దాని ఎక్స్టెన్షన్ మేడ మీద మావారి గదిలో వుంది. అలాగే ఓపిగ్గా విన్నాను. రెండు నిముషాలు జరిగింది సంభాషణ. అవతలవేపు మాట్లాడుతున్నది స్త్రీ అన్న విషయం గొంతునుబట్టి అర్థ

మైంది. ఆమె పేరు లావణ్యనికూడా తెలుసుకున్నాను. లక్షరూపాయలిస్తే, ఇక డబ్బు ఇవ్వవలసిన అవసరం వుండదని చెప్పింది. అంత డబ్బు తనదగ్గర లేదంటూ మా వారు చెప్పారు. ఎందుకైనా రేపు మధ్యాహ్నం నాలుగు గంటలకు ఈగల్ బార్‌లో కలుసుకోమని కోరింది. మా వారు సరేనన్నారు. ఆయన ఫోన్ పెట్టేశాక నేనూ ఫోన్ పెట్టేసాను'' అంది లీల.

''బాగుంది. అయితే నన్నేం చెయ్యమంటారు?''

''మీరు రేపు ఈగల్ బార్‌కు వెళ్ళండి. వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకునేది తెలుసుకోండి. ఆ తర్వాత ఆమెను వెంబడించి, అడ్రసు సంపాదించండి. వీలైతే ఆమె పుట్టు పూర్వోత్తరాలుకూడా సేకరించండి. ఆ వివరాలు నాకు చెప్పండి చాలు'' అంది లీల.

''అంటే మీవార్ని బ్లాక్ మెయిల్ నుంచి తప్పించే ప్రయత్నంగానీ, ఆమెను బెదిరించి పంపివేసే పనిగానీ చెయ్యనవసరం లేదంటారు?'' అన్నాను.

''అది తర్వాత ఆలోచించి చెపుతాను. ఈ పని చేసినందుకు మీ ఫీజు ఎంతో చెప్పండి. ఇస్తాను.''

''పని పూర్తయ్యాక మీకు తోచింది ఇవ్వండి చాలు'' అన్నాను.

''అలాకాదు!'' అంటూ పర్సు తెరిచి వెయ్యి రూపాయలు తీసి ఇచ్చింది. అందుకున్నాను.

''నేను శెలవు తీసుకుంటాను'' అంటూ లేచింది.

''మీ యింటి నెంబరు ఇవ్వండి. పని అయ్యాక మీకు వివరాలు చెప్పాలిగదా?'' అన్నాను.

''అవసరం లేదు. నేనే వస్తాను. మీరు ఫోన్ చేసినా, మా యింటికొచ్చినా ఆయనకు తెలుస్తుంది. అనుమాన

పడతారు. దాంతో నా పథకం చెడిపోతుంది" అంది లీల.

"సరే! మీకోసం వెయిట్ చేస్తాను. కానీ మీవారి ఫోటో ఏదైనా కావాలి. ఆయన్ను నేను గుర్తుపట్టాలిగా"

"నా దగ్గర ఫోటో లేదు. ఆయన బయలుదేరేముందు ఎలాంటి కోటు పాంటు వేసుకున్నదీ, టై కట్టుకున్నదీ మీకు ఫోన్‌లో చెపుతాను. దాన్నిబట్టి ఆయన్ను సులభంగా గుర్తుపట్టవచ్చు" అంది లీల.

"అలాంటి డ్రెస్ మరొకరు వేసుకుంటే..." నా అనుమానం వ్యక్తంచేసాను.

"అదంత సులభంగాదు. మీరు వార్ని సులభంగా గుర్తించగలిగే విధంగా డ్రెస్ చేసి పంపుతాను. ఓ.కే." అంది లీల.

"ఓ.కే!" అన్నాను.

ఆమె లేచింది... హాల్లోకి వెళ్ళి రెయిన్ కోటు తొడుక్కుంది. అడుగులు చకచక వేసుకొంటూ వెళ్ళిపోయింది లీల.

రాజాచంద్ర ఏదో సెక్స్ గొడవల్లో ఇరుక్కుని బ్లాక్ మెయిల్ చెయ్యబడుతూ వుండాలనిపించింది.

నేను చెయ్యవలసిందేమీ కనుపించలేదు. లీల ఫోన్ చేసి ఆమె భర్త గురించి వివరాలు చెప్పాకగానీ, నేనీ కేసులో పని ప్రారంభించవలసిన అవసరంలేదు. అలో చిస్తూ కూర్చున్నాను సిగరెట్ ముట్టించుకొని.

2

రాత్రి ఏడయింది.

ఆఫీసులోనే కూర్చుని వున్నాను. ఉన్నట్టుండి టెలి ఫోన్ మ్రోగింది. రిసీవరు పైకెత్తాను.

అవతలివేపునుండి "హల్లో!" అన్న శబ్దం వినిపించింది.

నేనుకూడా "హల్లో" అన్నాను.

"డిటెక్టివ్ సుధాకర్ గారేనా మాట్లాడుతూంట."

"అవును."

"నా పేరు లావణ్య" అందామె.

"ఏం కావాలి?"

"నా గురించి మీకు రాజాచంద్ర భార్య లీల ఏమన్నా చెప్పిందా?" అడిగింది లావణ.

"అలా చెప్పి వుంటుందని మీకెందు కనుమానం వచ్చింది."

"ఇవాళ ఆమె మీ ఆఫీసుకు రావడం చూసాను. ఆమె భర్తను వల్లో వేసుకుని, నేను అతని డబ్బంతా లాక్కుంటున్నాని ఆమె నాపైన అభియోగం చేసి వుండాలి" అందామె.

"ఏమో?" అన్నాను.

"అదేమిటి అలా తెలియనట్లడుగుతున్నారు. ఆమె ఏం చెప్పింది?" అడిగింది లావణ్య.

"ఆమె ఏం చెప్పినా, అది నాకూ ఆమెకూ మధ్య వున్న విషయం. పైగా రహస్యం. మరో మనిషికి చెప్పవలసిన అవసరం నాకు కనుపించడం లేదు. ఇంతకూ మీ రెందుకు ఫోన్ చేసినట్లు?"

"ఆమె మాటలు అన్నీ అబద్ధాలు. నాకూ రాజాచంద్రకు సంబంధం లేదు. అతనితో నాకు డబ్బు పరమైన లావాదేవీలు అసలు లేవు. ఈ విషయం మీరు తెలుసుకోవడం మంచిదని చెప్పేందుకు ఫోన్ చేసాను" అంది లావణ్య.

"థాంక్స్! ఇంతకూ మీ రెక్కడనుంచి మాట్లాడుతున్నారు?"

"అది మీ కనవసరం!"

"పోనీ అడ్రసేమిటి?"

"అదీ మీకు అవసరం లేదు."

"అయితే మీతో మాట్లాడే అవసరంగానీ, మీరు చెప్పిన విషయాలు నమ్మవలసిన అగత్యంగానీ నాకు లేదు" అంటూ తక్కున ఫోన్ రిసీవర్ క్రేడిల్ పైన పడేశాను.

లీల ప్రొద్దున్న వానలో నా ఆఫీసుకు వచ్చింది. ఈ వూళ్లో నాతోపాటు పది పన్నెండుమంది డిటెక్టివ్‌లు వున్నారు. లీల నా దగ్గరకే వస్తుందని లావణ్య ఎలా వూహించిందో అర్థంకాలేదు. లీలను చూడకుంటే, చూచినట్లు ఎలా ఫోన్‌లో చెప్పగలుగుతుంది?

లీల చెప్పిందాన్ని బట్టి లావణ్య ఎవరో, ఏమిటో, ఎలావుంటుందో, ఎక్కడుంటుందో, తనకు తెలీదు. అలాంటప్పుడు లావణ్యకు మాత్రం లీలను ఎలా తెలిసివుంటుంది. రాజాచంద్ర భార్య కాబట్టి, ఆమెను దూరంనుండి చూసి వుండవచ్చేమో ననుకున్నాను.

లీల చెప్పినమాటలు నిజంకావని చెప్పడానికి లావణ్య ఫోన్ చెయ్యవలసిన అవసరం ఏమొచ్చిందో నాకు తెలీలేదు. నేనెటూ పరిశోధిస్తాను. ఆ తర్వాత అసలు విషయం బైటపడుతుంది. లావణ్య అంతదాకా ఆగి వుంటే బాగుండేదనిపించింది.

నిజంగానే లావణ్యకీ గొడవతో సంబంధంలేదేమో! ఆ విషయం నాకు చెప్తే, అనవసరంగా ఆమెను వెంబడించడంగానీ, లేదా ఆమె గురించి వాకబు చెయ్యడంగానీ, చెయ్యకుండా వుంటానన్న ఉద్దేశ్యంతో ఆమె నాకు ఫోన్ చేసి వుండవచ్చు.

ఏమైనా కార్యరంగంలోకి దిగితేతప్ప, నా అనుమా నాలు నివృత్తి కావడం జరగదనిపించింది.

సిగరెట్ తీసి వెలిగించుకున్నాను. గట్టిగా దమ్ములాగి, ముక్కులగుండా పొగ వదిలాను. మెదడు భారంతగ్గి, కాస్త తేలికపడినట్లనిపించింది.

కుర్చీలోంచి లేచి గదంతా పచార్లు చెయ్యసాగాను.

ఇలాంటి సమయాల్లో నా అసిస్టెంటు వసంత లేని లోటు కొట్టొచ్చినట్లు కనుపించింది. ఆమెతో నా అను మానాలు చర్చిస్తే, కొన్ని కొన్ని క్రొత్త విషయాలు బయటపడుతుంటాయి. ఆమె వారం క్రితమే స్నేహితు రాలి పెళ్ళికని, సెలవు తీసుకొని వెళ్ళింది.

బల్లపైనున్న ఫోన్ మ్రోగింది మళ్ళా.

వెళ్ళి క్రేడిల్ తీసుకున్నాను. చెవిదగ్గర పెట్టుకొని "హల్లో!" అన్నాను మెల్లిగా.

"ఎవరు మాట్లాడేది?" అడిగింది అవతలివేపు కంఠం.

"మీరెవరు?" ఎదురుప్రశ్న వేశాను.

"నా పేరు రాజాచంద్ర. ఒకమారు డిటెక్టివ్ సుధా కర్ గారితో మాట్లాడాలి. చాలా అర్జంటు. వా రున్నారా?" అడిగా డవతలి వ్యక్తి ఆతృతగా.

"ఆఁ! నేనే సుధాకర్‌ను. ఏం కావాలి?"

"ఏం లేదు! నా భార్య లీల ఈదినం మిమ్మల్ని కలుసు కుందటగదూ. ఆమెకు నాపైన పెద్ద అనుమానం. నాకు చాలామంది స్త్రీలతో పరిచయంవుందనీ, వాళ్ళకోసం డబ్బు ఖర్చు పెడుతున్నాననీ, అనుకుంటూ వుంటుంది" అంటూ ఆగాడు అతను.

"అయితే...?" అన్నాను నేను.

"కానీ ఆమె అనుమానానికి అర్థంలేదు. నే నలాంటి వాణ్ణిగాను."

"అయినా నాకెందుకు చెప్పడం? అవి మీ స్వంత విషయాలు."

"అనే అనుకున్నాను. కానీ ఇంతకుముందు నాకు లావణ్య అనే ఆమె ఫోన్ చేసింది. నా భార్య మీ ఆఫీసులోంచి రావడం చూసిందట. మీతో కూడా మాట్లాడిందట. నాకూ ఆమెకూ ఏ విధమైన సంబంధం లేదు. ఈ విషయం చెప్తామని ఫోన్ చేశాను" అన్నాడు రాజాచంద్ర.

"మీ భార్యను లావణ్య ఎలా అనుమానించి వుంటుందో నాకు అర్థం కావడంలేదు" అన్నాను.

"ఆమెను సెక్రెటరీగా తీసుకుందామనుకుని రెండు మూడుసార్లు ఆఫీసుకు పిలిపించాను. ఒక పార్టీకూడా తీసుకెళ్ళాను. అది నా భార్య చూసింది. అప్పట్నుంచి నన్ను అనుమానిస్తోంది. ఆమె మాయలోపడి తనకు విడాకులిస్తానేమోనని భయం. లీల ఉత్త పిచ్చిది. ఆమె మాటలు సీరియస్‌గా తీసుకోకండి!"

"అవుననుకోండి! కానీ ఆమెదగ్గర ఫీజు తీసుకున్నాను" అన్నాను నవ్వుతూ.

"అది వుంచుకోండి. అంతకు రెట్టింపు నేనిస్తాను. అనవసరంగా మా వెంటపడి, మమ్మల్ని అల్లరిపాలు చెయ్యకండి" ప్రాధేయపడుతున్నట్లు అడిగాడు రాజాచంద్ర.

అతనికే విధమైన హామీ యివ్వడం నా కిష్టంలేక పోయింది. అందుకే "చూద్దాంలెండి. మిమ్మల్ని అల్లరి పెట్టడం మాత్రం నా ఉద్దేశ్యం కాదు!" అన్నాను.

ఆ తరువాత, అతని మాటలు వినే అవసరంలేకుండా ఫోన్ కట్ చేశాను.

నా కంతా అయోమయంగా వుంది. లీల వచ్చి వెళ్ళిన తర్వాత, లావణ్య, రాజాచంద్ర యిద్దరూ నాకు ఫోన్ చెయ్యడం అసంగతంగానూ, వింతగానూ అనిపించింది.

ఏది ఏమైనా, లీలకు యిచ్చిన మాట నిలబెట్టుకోవ డానికే నిర్ణయించుకున్నాను.

3

మధ్యాహ్నం మూడు కావస్తూంది.

అంతకుముందే వెళ్ళి కారు టాంక్ నిండా పెట్రోలు పోయించుకొచ్చాను. అక్కడే టైర్ల గాలికూడా చెక్ చేయించాను. అవసరమైతే రెండొందల మైళ్ళు ఏ విధ మైన ట్రబుల్ లేకుండా వెళ్ళగలుగుతుందని నిర్ణయించు కున్నాను.

ఫోన్ దగ్గరే కూర్చున్నాను.

అప్పుడప్పుడు వాచీకేసి చూసుకోసాగాను.

సరిగ్గా మూడు గంటలా నలభైఅయిదు నిముషా లయింది.

ఫోన్ గణగణమని మ్రోగింది.

ఠక్కున చెయ్యిచాచి క్రేడిల్ పైనున్న రిసీవరు అందు కున్నాను.

"సుధాకర్ స్పీకింగ్!" అన్నాను.

"నేను లీలను. ఆయన మరో ఐదునిముషాల్లో బయలు దేరుతారు. స్నఫ్ కలర్ సూట్ వేసుకున్నారు. ఎర్రటి టై కట్టుకున్నారు. టైపైన స్వస్తిక్ మార్కున్న గోల్డ్ పిన్ వుంది. అదే రంగు ఫెల్ట్ హాట్ పెట్టుకున్నారు.

గచ్చకాయ రంగు ప్రీమియర్ పద్మినీ ఫియట్ ఏ. పీ. ఎక్స్. ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది కారులో బయలుదేరు తున్నారు. ఆయన్ను ఈగిల్ బార్‌లో గుర్తుపట్టడానికి మీకీ గుర్తులు చాలనుకుంటాను." అంది లీల.

"చాలు! ఆ లావణ్య మళ్ళీ మీ వారికి ఫోన్ చేసిందా?"

"లేదు!" అంది లీల.

"థాంక్స్! మీరు నిశ్చింతగా వుండండి. నేను నా పనిలోకి దిగుతాను" అన్నాను.

"చెప్పింది గుర్తుందిగా. నాకా్కవలసింది వాళ్ళ రహస్యమేమిటి? ఆ లావణ్య ఉండేదెక్కడ? అంతే. అంతకుమించి మీ రిందులో తెలుసుకోవలసిందేమీ లేదు" అంది లీల.

"అలాగే! గుర్తుంచుకుంటాను" అంటూ ఫోన్ పెట్టేసి, చకచక ఆఫీసు మూసి, తాళం వేసుకొని, వెలుపలికొచ్చి కారెక్కాను. నున్నటి తారురోడ్డును చీల్చుకుంటూ ముందుకు దూసుకుపోసాగింది కారు.

సరిగ్గా ఇరవైఆరు నిముషాలకు ఈగల్ బార్ ముందు వెళ్ళి ఆగింది కారు. దిగి, లాక్ చేసి లోనికి వెళ్ళాను.

అంతకు ముందెప్పుడూ నేను అందులోకి వెళ్ళలేదు. చాలా విశాలమైన హాలు. సన్నగావుంది వెలుతురు. చీకటి క్రమ్మినట్లుంది నా కళ్ళకు. లోపలున్న టేబుల్స్, చెయిర్స్, మనుషులు లీలగా కనుపించసాగారు. గుమ్మాని కెదురుగా వుంది బార్. దానిముందు ఐదారు గుండ్రటి స్టూల్సు వున్నాయి.

అడుగులో అడుగు వేసుకుంటూ, అటూ ఇటూ ఆసీనులైన జంటల్ని చూచుకుంటూ బార్ వేపు వెళ్ళాను. నాకు కావలసిన జంట కనుపించలేదు. అక్కడున్న వాళ్ళెవరూ ఆ సూట్ లో లేరు.

తిన్నగా వెళ్ళి బార్ ముందున్న స్టూల్ పైన కూర్చున్నాను.

ప్లాస్టిక్ కవరు వేసిన కార్డొకటి నా ముందుకు జరిపాడు బార్‌లోవున్న యూనిఫాం బట్లర్. అందుకుని, కళ్ళకు దగ్గరగా పెట్టుకొని చదివాను. రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. అన్నింటిలోకి బీర్ కొంత చీప్‌గా వుంది. ఆర్డరు చేద్దామనుకున్నాను. నాకు తాగడం అలవాటు లేదు.

"కోక్ వుందా?" అడిగాను.

"లేదు. థమ్స్ అప్ కావాలా?" అడిగాడతను.

"ఇవ్వు" అన్నాను.

అతను బాటిల్ ఓపెన్ చేసి పెట్టాడు. అందులోకి స్ట్రా యిచ్చాడు. దాన్ని నోట్లో పెట్టుకుని సిప్ చెయ్యసాగాను.

"ఇది తాగేందుకింత దూరంవచ్చారా?" అడిగాడు నమ్మలేనట్లు.

"కాదు! నా ఫ్రెండు రావాలి! అతనొచ్చాక తీసుకుంటాం డ్రింక్స్. అంతదాకా కాలక్షేపంకోసం ఇది ఆర్డరు చేశాను" అన్నాను బాటిల్ చూపిస్తూ.

బార్‌లోకి వంగి ఏవో బాటిల్స్ సర్దుకుంటూ కనుపించాడు బట్లరు.

కార్పెట్ పైన బూట్లుచప్పుడు చేస్తున్నట్లు కరకర మనిపించింది.

ఫుల్‌సూట్‌లో వున్న వ్యక్తి, అతని ప్రక్క అందమైన ఒక అమ్మాయి రావటం క్రీగంట చూశాను. ఆమె బెల్‌బాటమ్ వేసుకొని, బనీను వేసుకుంది. కళ్ళకు గాగుల్సు వున్నాయి. కాళ్ళకున్న బూట్ల ఎత్తు ఆరంగుళాల దాకా వుంది. అతను ఫెల్ట్‌హాట్ పెట్టుకుని వున్నాడు.

వాళ్ళిద్దరూ వచ్చి నాకు కొద్దిదూరంగా స్టూల్స్‌పైన కూర్చున్నారు.

"స్కాచ్ విస్కీ టూ లార్జ్ పెగ్స్!" అంటూ ఆర్డరు చేశాడు.

"ఫ్రైడ్ పీస్ అండ్ కాజూ!" అందామె.

బార్‌లోవున్న వ్యక్తి చకచక గ్లాసులునింపి టేబుల్ పైన పెట్టాడు. ఆ తర్వాత రెండు ప్లేటలో కాజూ, బటానీలు వుంచారు. ఇద్దరూ మెల్లిగా, రహస్యంగా మాట్లాడుకోసాగారు.

వాళ్ళిద్దర్నీ బాగా చూడాలని ఎంతో ప్రయత్నం చేశాను. అతను కూర్చున్న ఫోజు ఆమెను పూర్తిగా కనుపించకుండా చేసింది. అతను హాట్ పెట్టుకోవడంతో మొహం కనుపించలేదు. టై మాత్రం కనుపించింది. కొద్దిగా ముందుకు వంగిచూశాను. స్వస్తిక్ మార్క్ గోల్డ్ పిన్ కనుపించింది. నా క్కావలసిన జంట అదేనని నిర్ధా రించుకున్నాను.

అతను ఆదేపనిగా, ఆబగా, కాజూ, బటానీలు తిన సాగాడు. గ్లాసులో మందుమాత్రం కదలడంలేదు. ఆమె గ్లాసు ఖాళీచేసింది. జేబులోంచి యాభై రూపాయల నోటు తీసి కౌంటర్‌లో పడేసి, తక్షణ లేచాడు. ఆమె కూడా లేచింది. ఇద్దరూ చకచక వెలుపలికి వెళ్ళి పోయారు.

నేను కూడా ఐదు రూపాయలనోటు తీసి ఇచ్చారు.

"మీ ఫ్రెండు రాకుండానే వెళ్తారా?" అడిగాడు.

"పనుంది. మళ్ళీవస్తాను" అంటూ చిల్లరకోసం కూడా ఎదురుచూడకుండా వీధినపడ్డాను.

నేను గుమ్మంలోకి రాకముందే గచ్చకాయ రంగు ఫియట్ కారు స్టార్టయి ముందుకు దూకింది.

నేను పరుగెత్తుకుంటూ వెళ్ళి నా కారెక్కి స్టార్టు చేశాను. ఆక్సిలేటరు బలంగా నొక్కాను.

నా క్కావలసిన కారు కనుపించింది. కానీ దానికీ, నా కారుకూ మధ్య దాదాపు ఐదు ఆటోలు, రెండు కార్లు వున్నాయి.

4

దాదాపు మూడునాలుగు మైళ్ళు అలా వెళ్ళాం ఒకరి వెంట ఒకరం. మా మధ్యవున్న వాహనాల సంఖ్య తగ్గింది.

ఒక ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఆరంజి రంగు సిగ్నల్ కనుపించింది. నేను కారు స్పీడు తగ్గించాను. కానీ ఆ సిగ్నల్ లైటు ఎరుపు తిరగకముందే రాజాచంద్ర, లావణ్య వెళుతున్న కారు దాటిపోయింది.

నా ముందున్న వాహనాలన్నీ ఆగిపోవడంతో నేనేమీ చెయ్యలేక ఆగిపోయాను.

రెండు నిముషాల తర్వాత గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

ఆ రోడ్ పైనే రెండు మైళ్ళు వెళ్ళాను. నా క్కావల సిన కారు కనిపించలేదు. మళ్ళీ వెనక్కి వచ్చి, ప్రక్క నున్న రోడ్లన్నీ గాలించాను. ఎక్కడా ఆ కారు జాడ లేదు.

నాపైనే నాకు కోపంవచ్చింది. కళ్ళముందే వాళ్ళు నానుంచి తప్పించుకోవడం నాకే అవమానం వేసింది. చేసే దేమీ లేదు గాబట్టి ఓడిపోయిన మొహం వేసుకుని ఇంటికి తిరిగొచ్చాను.

కారు గారేజిలో పెట్టి మెట్లెక్కి పైకొచ్చాను. ఆఫీసురూం తెరచి కూర్చున్నాను.

ఈగిల్ బార్‌లో వాళ్ళ మొహాలు చూడలేకపోవడం

ఆ తర్వాత వాళ్ళ కార్ను వెంబడించలేకపోవడం, రెండూ నా కెందుకో విచిత్రంగా కనుపించాయి.

వాళ్ళకు నేను వెంబడిస్తున్న విషయం తెలిసివుండాలని పించింది. అలా కానిపక్షంలో అంత ప్రమాదకరంగా, ట్రాఫిక్ సిగ్నల్ దాటి వెళ్ళివుండే అవసరం నాకు కను పించలేదు.

వెంటనే నాకు మరో అనుమానం వచ్చింది. వాళ్ళను ఈగిల్ బార్ నుంచి వెంబడిస్తానని, వాళ్ళకు తెలిసివుండే అవకాశం లేదు. ఈ విషయం తెలిసింది ఒక్క లీలకే. ఆమె వాళ్ళకు చెప్పివుండదు. కారణం ఆమే నన్నాపనికి నియోగించడం. అలాంటప్పుడు ఈ రహస్యం వాళ్ళకు ఎలా తెలిసివుంటుంది?

తల బ్రద్దలుకొట్టుకొన్నాను. మెదడుకు పదును పెట్టాను. ఆలోచనల్ను కదలించాను. అయినా నాకు సమాధానం దొరకలేదు.

అలాగే కుర్చీలో కూర్చుని ఆలోచిస్తూనే పడుకుని నిద్రపోయాను.

మళ్ళీ కళ్ళు తెరచేసరికి అర్థరాత్రి పన్నెండుగంట అయింది. ఎవ్వరో అదే పనిగా కాలింగ్ బెల్ నొక్కు తూండటం గమనించాను.

లేచి వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగా క్రైంబ్రాంచి ఇన్స్పెక్టర్ నాయర్ ప్రత్యక్షమైనాడు.

"నువ్వా! నాయర్ భాయ్! అర్ధ రాత్రిపూట ఏమిటీ రాక? ఫోన్ చేస్తే పోయేదిగా?" అడిగాను లోపలకు రమ్మని ఆహ్వానిస్తూ.

"అరగంటనుంచి ఫోన్ చేసిచేసి విసుగెత్తి వచ్చాను. నువ్వేం చేస్తున్నావ్. నిద్రపోతున్నావా?" అడిగాడు నాయర్.

"అలాంటిదే!" అన్నాను.

"ఫోన్ శబ్దానికి నిద్ర లేవలేదు. కానీ కాలింగ్ బెల్ కొట్టగానే లేచావ్? విచిత్రంగా వుంది" అన్నాడు నాయర్.

"ఇందులో విచిత్రమేమీ లేదు. ఈ శబ్దం వేరు. ఇది వినగానే వెళ్ళి తలుపు తియ్యడమనే ప్రక్రియ అసంకల్ప ప్రతీకారచర్యలా జరిగిపోతుంది. టెలిఫోన్ శబ్దం అలాంటిది గాదు" అన్నాను.

"పని లేకుండావుంటే నీ దగ్గర కూర్చుని హాయిగా కబుర్లు చెప్పకోవచ్చు. నాకీ సర్వీసులో వున్నన్నాళ్ళు అది వీలయ్యేట్లు లేదు" అన్నాడు నాయర్.

"ఏం? ఇప్పుడేమయిందని?"

"హత్యంటేనే పెద్ద హడావుడి మా పోలీసు డిపార్టుమెంటుకి. అందులోనూ, బాగా డబ్బున్నవాళ్ళు, పలుకుబడిగలవాళ్ళూ, హత్య చెయ్యబడితే అంతా కోలాహలమే" అన్నాడు నాయర్.

"అన్యాపదేశాలు ఆపి అసలుకథ వివరంగా చెప్పూ?" అన్నాను ఆతృత ఆపుకోలేక.

"ఈ వూళ్ళోకల్లా డబ్బుగల వ్యక్తి శ్రీ రాజాచంద్ర అనే ప్రముఖ వ్యాపారవేత్త హత్యకాబడ్డాడు" అన్నాడు నాయర్.

"ఎప్పుడు?"

"ఇంకా నిర్ణయం కాలేదు. ప్రాథమిక పరిశీలననుబట్టి, సాయంత్రం ఐదారుగంటల మధ్య జరిగివుండాలని భావిస్తున్నారు."

"ఎలా జరిగింది హత్య?"

"పాయింటు ముప్ఫయిరెండు కాలిబర్ రివాల్వర్

తూటాలు రెండింటిని, అతి దగ్గరనుంచి ఒకటి నుదికణత లోకీ, రెండోది గుండెలోకి పంపించినట్లు అనుమాని స్తున్నాం."

"శవం దొరికిందెక్కడ?"

"అతని కార్లోనే!" అన్నాడు నాయర్.

"అయితే నీవు సాయంగా ఈ కేసు పరిష్కరించేందుకు నన్ను పిల్చుకొని పోయేందుకు వచ్చావా?" అడిగాను.

"కాదు! నీనుండి కొన్ని విషయాలు తెలుసుకోవడా నికి వచ్చాను." అన్నాడు నాయర్.

5

"ఇదీ నాయర్ జరిగింది. అసలు నేనింత దారుణంగా ఈ కేసులో వెనుకపడి ఓడిపోవడం తలచుకొని సిగ్గేసింది. లీలకు మొహం ఎలా చూపించాలో అర్థంగాక సతమత మవుతున్నాను. ఇంతలో నువ్వొచ్చావ్?" అన్నాను.

"మనుషులు ఇక్కడే చేస్తారు పొరపాటు. నువ్వేదో పెద్ద డిటెక్టివ్ కాబట్టి తన భర్త హత్యకాకుండా కాపాడగలవన్న ఆశతో నీ దగ్గరకు లీల వచ్చింది. ఆమే గనుక తిన్నగా నా దగ్గరికి వచ్చివుంటే పరిస్థితి మరోలా వుండేది. ఈ అమాయకులకు జ్ఞానం ఎప్పుడొస్తుందో..." అంటూ కప్పుకేసి చూశాడు నాయర్. అవకాశం చిక్కి నప్పుడల్లా మాలాటివాళ్ళను ఆడిపోసుకోవడం అతనికి పరిపాటి.

"ఇంతకూ ఇప్పుడేం చెయ్యాలని చూస్తున్నావ్?"

"ఆ లావణ్యను ఈగిల్ బార్లో నువ్వు కాస్తకూడా చూడలేదా. ఆలాంటి వెలుతురులో, అదేమనిషి, తటస్థ పడితే గుర్తుపట్టగలవేమో ఆలోచించు" అడిగాడు నాయర్.

"ఏమో? చెప్పలేను" అన్నాను.

"వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూండగా నువ్వు ప్రక్కన వున్నానన్నావ్. ఆ సంభాషణలో పగకానీ, కోపంగానీ, లేదా అలాంటి మరేదైనా భావంగానీ వున్నట్లు, వాళ్ళ చేష్టల్ను బట్టి ఊహించి చెప్పగలవా?"

"చాలా మెల్లగా మాట్లాడుకున్నారు. నాకేమీ వినిపించనే లేదు."

"ఆమెకన్నా అతను బలవంతుడిగా వున్నాడుకదా?"

"ఖచ్చితంగా."

"కార్లో ఇద్దరూ ముందే ఎక్కారా? లేక ఆమె వెనుక కూర్చోందా?"

"ఇద్దరూ ముందుప్రక్క నున్నారు" అన్నాను గుర్తు తెచ్చుకుని.

"రాజా చంద్రకు తెలిసిన పరిచయం వున్న కొంతమంది అమ్మాయిల్ని పిలిపించాలనుకుంటున్నాను. వాళ్ళను ఈగిల్ బార్‌కు తీసుకెళ్ళి ఒక్కొక్కర్ని నీకు ఆ వెలుగులో అంతకు ముందామె వేసుకున్న బట్టలాంటి బట్టలు వేసి చూపిస్తాను. ఎవర్నయినా పోల్చుకోగలవేమో చూడు" అన్నాడు నాయర్.

"అలాగే! నా పూర్తి సహకారం వుంటుంది" అన్నాను.

"వస్తాను" అంటూ నాయర్ శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

నాకు చాలా విచారం కలిగింది. లీల తన భర్తకు ప్రమాదం జరుగుతుందేమోనన్న భయంతో నే ముందుగా వచ్చి నన్ను అతన్ని కాపాడమని, కోరింది. నా కర్తవ్యం నేను సరిగా నిర్వర్తించకపోవడంవల్ల అతను చని

పోయాడు. ఆమెకు అన్యాయం చేశానేమోనని తల్లడిల్లి పోయాను.

ఈ విషయం ఆమె ఫోన్ చేసి నాకు చెప్పివుండాల్సిందనిపించింది. ఇంతదాకా చెప్పలేదంటే, నా సామర్థ్యం పైన, శక్తియుక్తులపైన ఆమెకు నమ్మకం అసలు లేకుండా పోవడం తప్ప మరే కారణం వుండివుండదనుకున్నాను.

తెల్లారాక వెళ్ళి ఆమెను కలుసుకుని, కాస్త ఓదార్చి, కనీసం ఆమె భర్తను దారుణంగా హత్యచేసిన ఆ మనిషిని పట్టుకోవాలని తీర్మానించుకున్నాను.

నా కళ్ళు మూత పడకుండానే, భళ్ళున తెల్లవారిపోయింది. కాలకృత్యాలు తీర్చుకుని, ఫలహారం కాఫీ తీసుకుని, డ్రెస్ చేసుకుని కారెక్కి ఏడింటికల్లా బయలుదేరాను.

అరగంటకల్లా రాజాచంద్ర బంగళా ముందుకు చేరాను.

కాంపౌండ్ గేట్ వద్దవున్న గూర్ఖా "ఎవరు కావాలి?" అడిగాడు.

"లీలమ్మగార్ని చూడాలి!" అన్నాను.

"ఆమె మనస్సు బాగాలేదు. అయ్యగారు చనిపోయారు. ఇప్పటిదాకా పోలీసులు వస్తూ పోతూనే వున్నారు. ఎవర్నీ రానివ్వవద్దని చెప్పింది. రెస్టు తీసుకుంటూంది. మధ్యాహ్నం ఫోన్ చేసి అమ్మగారు రమ్మంటే రండి!" అన్నాడు వాడు.

"పోనీ ఒక పని చెయ్యి. ఈ కార్డు తీసుకెళ్ళి అమ్మగారికివ్వు. ఆమె రమ్మంటేనే వస్తాను. లేకుంటే వెళ్ళిపోతాను" అన్నాను.

"మీరు పోలీసులా?"

"ఆఁ!" అన్నాను బిగాయిస్తూ.

"అయితే వుండండి!" అని అతను కార్డు తీసుకొని వెళ్ళిపోయాడు.

నేను ఇంటికేసి చూస్తూ నిల్చున్నాను. అధునాతనంగా కట్టబడ్డ భవనం అది. మొత్తం మూడంతస్తులు వున్నాయి. ఇంటి ముందు చాలా పెద్ద తోటవుంది. దూరంగా నాలుగైదు కార్లు ఆగివున్నాయి.

ఐదు నిముషాల తర్వాత దర్వాను తిరిగి వచ్చాడు.

"ఏమంది ఆమె?" అడిగాను ఆత్రుతగా.

"డ్రాయింగ్ రూంలోకి వెళ్ళి కూర్చోండి. అమ్మగారు పది నిముషాల్లో వస్తారు!" అన్నాడు గేటుతీస్తూ.

కారు స్టార్టుచేసి లోనికి పోనిచ్చాను.

డ్రాయింగు రూంలోకి వెళ్ళి కూర్చున్నాను.

పనిమనిషి కప్పులో కాఫీ తెచ్చిపెట్టింది. తీసుకున్నాను. మరో పనిమనిషి రెండు న్యూస్ పేపర్లు తెచ్చి నా ముందున్న టీపాయ్ పైన పడేసి వెళ్ళాడు. ఒకటి తీసుకున్నాను చూద్దామని.

ఇంతలోనే టకటకమంటూ చప్పుడయింది. ఆ శబ్దం విని తలెత్తాను.

ఎదురుగా లీల నిల్చుని వుంది. నల్లటిచీర, జాకెట్‌లో మూర్తీభవించిన శోకదేవతలాగుంది. నేనుకూడా లేచి నిలుచున్నాను.

కూర్చోమన్నట్లు చేత్తో సైగచేసి, ఆమె నా కెదురుగా వున్న సింగిల్ సోఫాలో కూర్చుంది. నేనుకూడా కూర్చున్నాను.

"ఎందుకొచ్చారు?" అడిగింది మెల్లగా.

"మీరు నాకు అప్పగించిన పని విజయవంతంగా నిర్వ

హించలేకపోయినందుకు క్షమాపణ చెప్పుకుని, మీ రిచ్చిన ఫీజు డబ్బు తిరిగి ఇద్దామని వచ్చాను."

"అవసరం లేదు. నా ఖర్మ అలా రాసివుంది. దీనికి మీరు కర్తలుగారు" అంది లీల.

"నేను ఇంకొంత జాగ్రత్త వహించి వుంటే రాజా చంద్ర కిలాంటి దారుణ మరణం సంభవించేదిగాదు. మీ రనుమతిస్తే హంతకుల్ని పట్టుకుని ఉరికంబ మెక్కిస్తాను. కనీసం ఈ రూపంగానైనా నా ఋణం తీర్చుకోనివ్వండి" అన్నాను.

"అవసరం లేదు. ఆ గొడవేదో పోలీసులు చూస్తారు. మీరు దయచేసి ఈ గొడవలోకి దిగకండి. మీకు తెలిసిన విషయాలేమైనా వుంటే ఇన్‌స్పెక్టర్ నాయర్‌కి చెప్పండి చాలు!" అంది లీల.

"అంటే మీకు నామీద నమ్మకం పూర్తిగా పోయి నట్లే వుంది. అందుకే ఇంత నిర్మొహమాటంగా చెప్తు న్నారు" అన్నాను.

"అలా అనుకోకండి. హత్యచేసిన వాళ్ళనుపట్టుకున్నా నాకు జరిగేది ఏదీలేదు. మీరు గొడవలు మరచిపోయి హాయిగా వుండండి. పోలీసులు చూసుకుంటారు" అంది లీల.

"నా అపజయానికి కారణం నా అసమర్థత కాదు. ఒక విధంగా మీ అవివేకం!" అన్నాను ఆవేశం ఆపుకోలేక.

ఏమిటన్నట్లు చూసింది.

"మీరు నా యింటికి వచ్చినట్లు, లావణ్యాకూ, రాజా చంద్రకు తెలుసు. ఇద్దరూ నాకు ఫోన్ చేశారు. నేను ఎన్ని గంటలకు ఎక్కడ్నుంచి ఎలా వాళ్ళను వెంటాడేది వాళ్ళకు ముందుగానే తెలుసు. అందువల్లే సులభంగా నా

నుంచి తప్పుకొని పోయారు. మీరే వాళ్ళకు చెప్పివుండా అని నా అనుమానం" అన్నాను.

"నాన్సెన్స్! నేను చెపుతానా?అందులోనూ వాళ్ళకు"

"వాళ్ళకు గాకుంటే మరొకరికి. మీకు నమ్మకం అనిపించిన వ్యక్తికి మీరు చెప్పివుంటారు. ఆ వ్యక్తి వెంటనే ఆ విషయం వాళ్ళకు చేరవేసి వుంటాడు. కాకుంటే నాకు ఫోన్ చెయ్యడంగానీ, దృష్టినుంచి తప్పించుకొనిపోవడం గానీ, సాధ్యమయ్యేదికాదు!" అన్నాను దృఢంగా.

"వాళ్ళకు నేను చెప్పలేదు. నన్ను వెంబడించారేమో తెలీదు!" అంది లీల.

"వృత్తిరీత్యా నాకీ కేసు పెద్దదెబ్బ. నన్ను నేను నిలబెట్టుకొనేందుకు ఆ హంతకుల్ని పట్టుకోవాలి! దానికి మీ అనుమతి కావాలి!" అన్నాను.

అంతలో లాల్చీ పైజామా వేసుకున్న యువకుడు గదిలోకి వచ్చాడు.

"అత్తయ్యా! ఇక్కడున్నావా? రెస్టు తీసుకోమన లేదూ!" అడిగాడు.

"వీరు అర్జంటుగా మాట్లాడాలంటే వచ్చాను నరేన్"
అంది లీల.

"నా పేరు సుధాకర్! ప్రైవేట్ డిటెక్టివ్ను" అన్నాను.

"విన్నాను. నా పేరు నరేన్. వీరి మేనల్లుడ్ని.అమెరికా యం.బి.ఏ. చేశాను" అన్నాడతను.

ఇద్దరం కరచాలనం చేసుకొన్నాం.

"మళ్ళీ వస్తాను!" అన్నాను లేస్తూ. అతని సమక్షంలో ఈ విషయం గురించి ఆమెను ఒత్తిడి చేసేందుకు నాకు మనస్కరించలేదు.

నేను వెలుపలికొచ్చేశాను.

6

పోలీస్ స్టేషను ముందు కారాపాను. దిగి లోనికి వెళ్ళాను.

నన్ను చూడగానే నాయర్ "రా! రా! క్రొత్త క్లూ ఏదన్నా గుర్తొచ్చిందా?" అడిగాడు నవ్వుతూ.

"లేదు! రాజాచంద్ర ఇంటికి వెళ్ళివచ్చాను" అన్నాను అతని కెదురుగా కూర్చుంటూ.

"ఎందుకు?"

"ఆమెను కాస్త పరామర్శ చేద్దామని" అంటూ "ఇంతకూ ఆ శవం ఫోటోలు వున్నాయా?" అడిగాను.

డ్రాయరులోంచి కవరుతీసి ఇచ్చాడు. దాన్ని తెరచి లోనున్న ఫోటోలన్నీ ఒక్కొక్కటే పరిశీలనగా చూశాను.

"కారెక్కడ దొరికింది?" అడిగాను.

"ఊరికి ఉత్తరంగా వున్న క్లాస్ క్లబ్ కు వెళ్ళే రోడ్ పైన" అన్నాడు నాయర్.

"ఎవరివైనా వ్రేలిముద్రలు దొరికాయా?"

"లేదు!"

"ఈ ఫోటో ప్రకారం రాజాచంద్ర చనిపోయే ముందు స్టీరింగు వీల్ ముందు వుండివుండాలి. అతన్ని హత్యచేసిన వ్యక్తి, ప్రక్కనే కూర్చునివుండాలి. నడుస్తూన్న కారులో కూర్చున్న మనిషి ప్రక్కనున్న మనిషి గుండెల్లోకి తుపాకీ ప్రేలుస్తే కారు కంట్రోలుతప్పి అటూఇటూ పోవాలికదా? కానీ అలాపోకుండా నడిరోడ్ లో నిలబడివుంది కారు. ఎందుకని ఆలోచించావా?" అడిగాను.

"కారాపుకుని యిద్దరూ మాట్లాడుకుంటూ వుండ

వమ్ము. వాగ్వివాదం పెరిగి పెద్దది కావటంతో ప్రక్కనున్న మనిషి కోపం పట్టలేక రివాల్వరుతో కాల్చి వుంటాలనుకున్నాను."

"బట్టల పైన రక్తంవుందా?"

"ఆ బట్టలు చూస్తావా?" అడిగాడు నాయర్.

"ఆఁ! నీ కభ్యంతరం లేకుంటే చూపించు" అన్నాను.

కానిస్టేబుల్ని పిలిచి ఏదో చెప్పాడు. రెండు నిముషాల తర్వాత న్యూస్ పేపరు పార్సిలు తెచ్చి టేబుల్ పైన పెట్టాడు కానిస్టేబిల్. దానికున్న దారం విప్పాడు నాయర్. లోపల స్నఫ్ కలర్ పాంటు, కోటు ఎర్రటి టై, దానికున్న గోల్డ్ పిన్ కనుపించాయి. కానీ ఆ పిన్ స్వస్తిక్ షేప్ లో లేదు. మామూలు క్లిప్ లాగుంది.

నాకు ఆశ్చర్యమేసింది. బార్ లో నేను బాగా చూశాను. స్వస్తిక్ షేప్ పిన్ను కనుపించింది. అతను యింటినుంచి బయలుదేరబోయే ముందు ఆ మాటే చెప్పింది లీల నాకు. కారెక్కి, ప్రాణాలు పోగొట్టుకోవబోయే లోపల టై పిన్ ఎలా మారివుంటుందాని ఆలోచించసాగాను.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అడిగాడు నాయర్.

నా అనుమానం చెప్పాను.

"ఆ చీకటిలోంచి వెలుతురులో నీకు కనుపించి వుండదు. ఏదో పొరపాటుపడి వుంటావ్?" అన్నాడు నాయర్.

"లేదు! నాకు బాగా గుర్తువుంది" అన్నాను.

"అయితే వుండు!" అంటూ ఫోన్ తీసుకుని లీలకు డయల్ చేశాడు. ఆమెను అడిగాడు. ఆమె, తన భర్త యిల్లు వదలిపోయే ముందు ఏ పిన్ పెట్టుకుంది చూడలేదని, నాయర్ తో చెప్పినట్లు చెప్పాడు.

ఫోన్ పెట్టేసి "యిప్పుడేమంటావ్?" అడిగాడు.

"ఏమనాలో నాకే తెలీడంలేదు. అయినా తెలుసుకుంటాను" అన్నాను కోపంగా.

"నీకీ కేసులో క్లయింట్లులేరు. అనవసరంగా తల దూర్చావంటే వున్న లైసెన్సు కాస్తా ఊడబీకుతారు. జాగ్రత్త!" అన్నాడు నాయర్.

"నీ సలహా గుర్తుంచుకుంటాను" అన్నాను లేస్తూ.

స్టేషను వెలుపల పార్కు చేసిన కారెక్కి, తిన్నగా, హత్య జరిగిన ప్రదేశంవేపు పోనిచ్చాను.

ఊరు దాటాక మైలువెళ్తేగాని ఆ ప్రదేశం రాలేదు. ఆ చుట్టుప్రక్కల తచ్చాడిచూచాను. ఏ విధమైన క్లూలు దొరకలేదు.

కారును ఇంకా ముందుకు పోనిచ్చాను. క్లాస్ క్లబ్ కనుపించింది. కారాపి లోనికి వెళ్ళాను.

నేనందులో మెంబర్నుకాను. ఊళ్ళోవున్న గొప్పవాళ్ళందరూ అక్కడ మెంబర్లే. బిలియర్డ్సు, గాల్ఫు, పేకలు, మొదలైన అన్ని రకాల ఆటలూవున్నాయి.

లోనికెళ్ళగానే మేనేజరు అని రాసిన రూం కనుపించింది. తిన్నగా వెళ్ళి అందులోకి దూరాను.

7

ఏదో రాసుకుంటున్న వ్యక్తి నన్ను చూచి తలపైకెత్తి "ఎవరు కావాలి సార్!" అడిగాడు.

"మీరే!" అన్నాను యెదురుగా కూర్చుంటూ.

"చెప్పండి. మెంబర్ షిప్ కోసం వచ్చారా?"

"లేదు! ఒక మెంబరు గురించి వాకబు చేసేందుకు వచ్చాను" అన్నాను జేబులోంచి సిగరెట్ తీసి ముట్టించుకుంటూ.

"ఎవరు?"

"రాజాచంద్ర. అతను మీ మెంబరేగా?"

"అవును సార్! పాపం ఎవరో హత్య చేశారట. పోలీసులుకూడా వచ్చి వెళ్ళారు" అన్నాడతను జాలిగా.

"నేను పోలీసను కాను. డిటెక్టివ్ ను. అతనెలాంటి వాడో చెప్పగలరా?"

"చాలా మంచివాడు సార్. చాలా అరుదుగా వచ్చే వాడు. గోల్ఫ ఆడేవాడు" అన్నాడు అతను.

"నిన్న అంటే అతను హత్య కాబడిన రోజు వచ్చాడా?"

"వచ్చాడు సార్! ఉదయం పదకొండింటికివచ్చాడు. వెంట వారి శ్రీమతి లీలమ్మకూడా వుంది. ఇద్దరికీ భోజనం కూడా క్లబ్బులోనే ఆర్డరు చేశాడు. ఒంటిగంట దాకా వుండి భోంచేశారు. ఆ తర్వాత రాజాచంద్ర గారు మళ్ళా గోల్ఫ ఆడేందుకు వెళ్ళారు. లీలమ్మగారు ఆ చెట్లక్రింద తిరుగుతూండటం చూశాను. అంతే సార్. ఆ తరువాత నాకు తెలియదు" అన్నాడు మేనేజర్.

"వాళ్ళు ఎన్ని గంటలకు క్లబ్ నుండి వెళ్ళిపోయింది తెలీదన్న మాట."

"తెలీదు సార్!"

"థాంక్స్!" అంటూ లేచాను. వెలుపలికి వచ్చి పార్క్ చేసిన కార్లకొద్దీ దూరంలో కూర్చునివున్న కుంటివాడి దగ్గరకు కెళ్ళాను.

జేబులోంచి రూపాయినోటు తీసి వాడి దగ్గరున్న డాలా డబ్బాలో పడేశాను.

"ఎన్నాళ్ళ నుంచి యిక్కడుంటున్నావ్?" అడిగాను.

"ఎన్నాళ్ళా? ఏళ్లోని అడగండి" అన్నాడు గర్వంగా.

"అయితే పాతవాడివే నన్నమాట. ఇక్కడ ఎలా వుంది నీ వ్యాపారం?"

"బాగానే వుంది సార్. ఇక్కడికొచ్చే అయ్యల్నీ, అమ్మల్నీ చాలావరకు పేరుపేరున తెలిసిపోయింది. కార్లు శుభ్రంగా తుడిచిపెడతాను. పదో పరకో యిస్తుంటారు వాళ్ళు" అన్నాడు కుంటివాడు.

"నీకు రాజాచంద్రగారనే మెంబర్ను తెలుసా?"

"తెలుసు. వారి భార్యపేరు లీలమ్మ. అయ్యగారు చాలా మంచివాడు. పదికి తక్కువరాదు చేతికి. అమ్మగారు ఎప్పుడూ చిటపటలాడుతూంటుంది" అన్నాడు వాడు.

"నిన్న ఆయన్ను హత్యచేశారు. ఇక్కడి కాస్త దగ్గర్లోనే. నీకు తెలుసా?"

"విన్నాను సార్! మంచివాళ్ళని ఎన్నో రోజులు బ్రతకనీరు!"

"ఆయన్ను హత్యచేసిన వాళ్ళను పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాను. బాగా గుర్తు చేసుకొని చెప్పు. నిన్న ఆయన క్లబ్‌కు వచ్చారు కదూ?"

"వచ్చారు సార్! హెరాల్డ్ కారులో వచ్చారు."

"అమ్మగారుందా?"

"ఉంది!"

"తిరిగి వాళ్ళు యెన్ని గంటలకు వెళ్ళిందీ చెప్పగలవా?"

"రెండుగంటల ప్రాంతంలో అమ్మగారు మాత్రం వచ్చింది. కారు తాళాలు నా దగ్గరుండాయి. లోపలా

వెలుపలా తుడవమని పురమాయించారు అయ్యగారు. తాళాలు తీసుకుంది. అయ్యగారేరమ్మా అని అడిగాను. ఆ ముందు ఎక్కతా మన్నారని చెప్పి వెళ్ళింది" అన్నాడు వాడు.

"నీ ముందు అయ్యగారు ఎక్క లేదా?"

"లేదు సార్!" అన్నాడు వాడు ఖచ్చితంగా.

ఐదురూపాయల కాగితంతీసిచ్చి, వెళ్ళి కారెక్కాను.

8

రాజాచంద్రగారి ఆఫీసుకి వెళ్ళాను. మేనేజరు నా కార్డు చూడగానే పిలిచాడు లోనికి.

"నమస్తే!" అన్నాను ఎదురుగా కూర్చుంటూ.

"మీరీ కేసు తీసుకున్నారా?"

అవునన్నట్లు తలూపాను.

"వారు చాలా మంచివారు సార్! వార్ని చంపవలసినంత అవసరం యెవరికొచ్చిందో నాకు అర్థం కావడం లేదు!" అన్నాడతను.

"వ్యాపారరీత్యా ఎవరితో నన్నా విరోధంగానీ, మరే రకమైన తగాదాలుగాని వున్నాయా?" అడిగాను.

"అలాంటివి లేవండీ!"

"ఆయనకు స్త్రీ వ్యసనం వుందా?"

"ఒకప్పు డుండేది. నాలుగు సంవత్సరాలనుంచి అలాంటిదేమీ లేదు. ఆయనకు ఒకమారు హార్ట్ అటాక్ వచ్చింది. బి. పి. కూడావుంది. షుగర్ వుంది. అందువల్ల చాలా జాగ్రత్తగా వుండేవాడు."

"నిజంగానే..."

"నిజమండీ!" నొక్కి చెప్పాడు.

"ఈ మధ్య అతను లావణ్య అనే ఒక అమ్మాయిని

సెక్రటరీగా పెట్టుకుందామని అనుకున్నాడని విన్నాను. నిజమేనా?''

''నాతో యెప్పుడూ అనలేదండీ!''

''ఆమె యిక్కడికి వచ్చినట్లు నాకు రాజాచంద్ర గారు చెప్పారు. నేనుకూడా ఆమెను చూచాయగా చూచాను. ఆమే రాజాచంద్ర గారిని చంపివుంటుందని, వారి శ్రీమతి గారి అనుమానం. ఆ లావణ్య రాజాచంద్ర గార్ని బెదిరించి డబ్బు గుంజుతుందనీ కూడా నా కామె చెప్పింది. మీకు తెలిసినంతలో రాజాచంద్ర గారు యెక్కువ మొత్తంలో డబ్బు డ్రా చేసినట్లుగా వుందా?'' అడిగాను.

''అబ్బే లేదండీ!'' అన్నాడు మేనేజరు.

''మీ రెలాగైనా ఈ లావణ్య అనే ఆమె ఎవరో, ఏమిటో, యెక్కడుంటుందో కాస్త వాకబుచేసి చెప్పాలి. ఆమెను పట్టుకుంటే తప్ప అసలు విషయం వెల్లడికాదు. నేనూ నా ప్రయత్నం చేస్తాను. మీరు కాస్త శ్రమ తీసుకోవాలి'' అన్నాను.

''అలాగే! ఇందాకా ఇన్‌స్పెక్టర్ నాయర్ గారు వచ్చారు. ఆయన కూడా మీ రడిగిన ప్రశ్నలే అడిగాడు. మీకు చెప్పిన జవాబులే చెప్పాను''అన్నాడు మేనేజరు.

''థాంక్స్! వస్తాను'' అంటూ లేచాను.

''కాఫీ తీసుకోరా?''

''వద్దండీ! అవతల చాలా అర్జంటు పనులున్నాయి'' అన్నాను అక్కడ్నుంచి కదులుతూ.

క్రిందికొచ్చి కారెక్కాను. ఎటు పోవడమాని ఆలోచిస్తూ కూర్చున్నాను కాసేపు. ఆ తర్వాత నా ఆఫీసుకు పోవడంకన్నా వేరే పనిలేదని తేలింది. తిన్నగా పోనిచ్చాను కారును ఆఫీసువైపు.

ఆఫీసుకెళ్ళి కూర్చున్నాను.

మనస్సంతా చీకాకుగా వుంది. హత్య జరిగి ఇరవై నాలుగు గంటలు దాటిపోయినా ఏ విధమైన ప్రగతి సాధించలేదు నేను. పోలీసుల పరిస్థితి కూడా అలాగే వుంది.

లావణ్య హత్య చేసి వుంటే, ఈపాటికి ఆమె ఊరు నుండి యెటన్నా ఉడాయించి వుండాలి. బ్లాక్ మెయిల్ చేసే వాళ్ళు, బంగారు గుడ్లు పెట్టే బాతుల్లాంటి తమ క్లయింట్లను చంపుకోవడం నేను వినలేదు. రాజాచంద్ర ఆ దినం బ్యాంక్ నుంచి డబ్బు డ్రా చేసినట్లు యెవ్వరూ చెప్పడంలేదు. అప్పుడు నాకు రివాల్వరు సంగతి గుర్తొచ్చింది. ఆ రివాల్వరు అంతదాకా యెక్కడా దొరకలేదు.

నాయర్‌కు డయల్ చేశాను. రెస్పాన్స్ రాగానే "నేను భాయ్ సుధాకర్‌ను. పాయింటు ముప్ఫయి రెండు కాలిబర్ రివాల్వర్స్ లైసెన్స్ వున్న వ్యక్తుల జాబితా చూశావా?" అడిగాను.

"ఆఁ!" అన్నాడు నాయర్.

"ఎంతమంది వున్నారు."

"ఆరుమంది."

"అందులో రాజాచంద్ర కూడా వున్నాడు."

"నువ్వెలా ఊహించావ్?"

"ఉన్నాడు కదూ."

"ఉన్నాడు!" అన్నాడు నాయర్.

"అయితే ఒక పని చెయ్యరాదు. ఆ ఆరు రివాల్వర్స్ తెప్పించి ఎక్స్‌పర్ట్‌కిచ్చి టెస్ట్ చేయించు. ఎవరిది హత్య కుపయోగించబడిందో తెలుస్తుంది" అన్నాను.

"ఇంత గొప్ప ఐడియా నీ కిప్పుడు వచ్చింది. నాకు

ఆరుగంటల క్రింద నే తిట్టింది. అసలు జరుగుతోంది''
అన్నాడు వాయర్.

''మరొకమాట. ఆ ఆరుగురి పరిచయస్థులలో 'లావణ్య' అనే అమ్మాయిగానీ, స్త్రీగానీ ఎవరన్నా వుందేమో విచారించు,'' అన్నాను.

''ఇది బ్రైట్ ఐడియా! ఇప్పుడే పని ప్రారంభం చేస్తాను.''

''థాంక్స్!'' అని ఫోన్ పెట్టేశాను.

ఉదయంనుండి నేను సేకరించిన సమాచారం మొత్తం మనస్సులోనే క్రోడీకరించుకున్నాను. అందులో తేలింది రాజాచంద్ర చాలా మంచివాడు. నాలుగైదు సంవత్సరాలనుండి హార్ట్ ఎటాక్ వచ్చింది. స్త్రీ వ్యసనం ప్రస్తుతం లేదు. ఎక్కువగా డబ్బు డ్రా చెయ్యలేదు. వ్యాపారంలో పగలుగానీ, ప్రత్యర్థులుగానీ లేవు, లేరు. లావణ్య అనే ఆమె ఎవ్వరూ రాజచంద్రగారి ఆఫీసుకు వచ్చిన దాఖలాలేదు.

గ్లాస్ క్లబ్‌లోకి వెళ్ళడం మాత్రం చూచిన సాక్షి వున్నాడు. వెలుపలకు రావడం ఎవ్వరూ చూడలేదు. ఎర్రరంగు హెరాల్డ్ కారులో వెళ్ళారు క్లబ్బుకు.

లీల చెప్పిందానిప్రకారం అతనూ, లావణ్య గచ్చకాయరంగు ఫియట్ కారులో వెళ్ళారు. రాజాచంద్ర శవం ఆ కారులోనే దొరికింది. అందులో ఎక్కడా రక్తపు మరకలు గానీ, వ్రేలిముద్రలు గానీ లేదు.

అతన్ని చంపివుంటుందనుకొన్న లావణ్య ఎటు పోయిందో తెలీలేదు.

వీటి ఆధారంగా మెదడుకు పదునుపెట్టి ఆలోచించసాగాను. లీల చెప్పిందాన్నిబట్టి చూస్తే. రాజాచంద్రను

చంపడానికో, లేదా చంపించడానికో ఎక్కువ అవసరం ఆమెకే వున్నట్లనిపించింది. లావణ్య మోజులో పడో, లేక బ్లాక్ మెయిల్ కి లొంబడో తనను విడాకులిచ్చే ప్రమాదముందని ఆమె భయపడుతూ వుండవచ్చు.

విడాకులంటే ఐశ్వర్యాన్ని, ఆనందాన్ని, పోగొట్టుకోవడమే అవుతుంది. వాటికి అలవాటుపడ్డ లీల, అవి లేకుండా వుండలేదు. అందువల్ల అతన్ని హత్యచేసేందుకు ప్రయత్నం చేసినా చెయ్యవచ్చుననుకున్నాను.

కానీ లావణ్యను, రాజాచంద్రను నేను చూశాను. వాళ్ళిద్దరూ నా కళ్ళముందే కారెక్కి వెళ్ళారు. లావణ్య చేత లీల రాజాచంద్రను చంపించి వుంటుందని అనుకోవడానిక్కూడా వీలులేదు.

పోతే లావణ్య అనే అమ్మాయి తమ ఆఫీసుకు రానేలేదని ఆఫీసు మేనేజరు చెప్పాడు. కానీ రాజాచంద్ర ఫోన్ లో స్వయంగా, తన ఆఫీసుకు ఆమె రెండు మూడుసార్లు వచ్చిందని చెప్పాడు. ఇందులో ఏది నిజం?

మేనేజర్ జవాబులు నాకెందుకో చాలా సిన్సియర్ గా కనుపించాయి. మరి రాజాచంద్ర మాటలు అబద్ధాలా? తన భార్య అనుమానిస్తున్నదని తెలిసీ, లావణ్య అనే అమ్మాయి తనకు తెలుసునని అతను చెప్పవలసిన అగత్యం ఏముందో నాకు అర్థంగాలేదు. అతను అబద్ధాలు చెప్పడం అవసరం లేకుంటే...ఆ చెప్పింది రాజాచంద్ర కాకుండా వుండాలనిపించింది. అది సాధ్యమా?

అవాక్కయి కూర్చున్నాను. నా మెదడు పని చెయ్యడం కొన్ని క్షణాలు నిలిచిపోయింది.

నాతో మాట్లాడింది రాజాచంద్రని నేను అనుకుంటున్నాను. నాకు అతన్ని తెలీదు. అతని గొంతు అంతకు

ముందు వినలేదు. ఎవరైనా ఫోన్ చేసి నేను రాజాచంద్ర నంటే కాదని అనుమానపడవలసిన అవసరం కూడా కనుపించలేదు. అతను రాజాచంద్ర కాకుండా వుంటే...

అతనికి ముందు లావణ్యానంటూ చెప్పి మాట్లాడిన స్త్రీ కూడా లావణ్య అయివుండవలసిన ఆగత్యం లేదనిపించింది.

లీల నా యింటికి వచ్చి వెళ్ళడం తను తెలుసుకున్నానంటూ లావణ్య ఫోన్ చేసి చెప్పినప్పటినుండీ, నాకు కొంత చిత్రంగానే వుంది. కానీ అప్పట్లో అది ధృవీకరించుకోలేకపోయాను. అయితే ఇదంతా నాటకం అయి వుండాలి.

ఈ నాటకం వెనుకనున్న సూత్రధారి ఎవరు? ఏం ప్రయోజనం ఆశించి ఈ నాటకం మొదలెట్టి వుంటారు? ఈ ప్రశ్నలకు జవాబులు దొరికితే తప్ప కేసు ముందుకు నడవదు.

అలాగే ఆలోచిస్తూ కూర్చున్నాను.

టైం చూసుకున్నాను. ఏడయింది. ఒకమారు వెళ్ళి లీలను కలుద్దామనిపించింది.

9

పోలీస్ స్టేషన్ ముందాగాను.

లోపల నాయక్ వున్నాడు. నన్ను చూసి "ఏం భాయ్! వచ్చావ్?" అన్నాడు.

"ఇటు వెళ్తూ ఓ మారు నిన్ను చూసి వెళ్దామనిపించి ఆగాను. ఏమైనా క్రొత్త విశేషాలు తెలిశాయా?"

"ఏంలేదు? నీకేమన్నా తెలిశాయా?"

"లేదు!" అంటూ "ఆ రివాల్వర్సు విషయం తెలిసిందా?" అడిగాను.

"ఆఁ! ఆ మిగిలిన ఐదూ దొరికాయి. రాజాచంద్రదే దొరకలేదు," అన్నాడు.

"లావణ్య గురించి వాకబు చేశావా?"

"ఆఁ! క్రిష్ణమూర్తిగారని వైన్ మర్చంట్ వున్నాడు. అతని కుమార్తె పేరు లావణ్య," అన్నాడు నాయర్.

"అయితే ఇంక ఆలస్యమెందుకు. ఆమెను పట్టుకుంటే తెలిసేదిగా?" అన్నాను.

"వెళ్ళొచ్చాను. ఆ అమ్మాయి స్కూలునుంచి రాలేదు. రెండో క్లాసు చదువుతూందట." అన్నాడు నాయర్ నవ్వుతూ.

నాకూ నవ్వాగలేదు.

"అయితే మనం కొండనుత్రవ్వి ఎలుకను పట్టినట్లయిందన్న మాట. రివాల్వరు గురించి లీలగారికి తెలుసేమో కనుక్కున్నావా?"

"అదీ అయింది. తనకు దాని సంగతి తెలీదంది. అదెప్పుడూ ఆమె భర్త అధీనంలోనే వుంటుందట" అన్నాడు నాయర్.

"ఆ రోజు అతను రివాల్వరు వెంట తీసుకెళ్ళాడని అనుకుందాం. అతనికూడా తెలీకుండా, లావణ్య దాన్ని తస్కరించి దాంతోనే అతన్ని చంపడం జరిగివుండాలి. ఇది సాధ్యమా?" అన్నాను.

"ఏం? ఎందుకు గాదు?"

"తన ప్రాణానికి ప్రమాదం వాటిల్లుతుందేమోనన్న అనుమానం లేనిది రాజాచంద్ర రివాల్వరు వెంట తీసుకెళ్ళడు. అలాంటప్పుడు దాన్ని ఎంతో జాగ్రత్తగా పెట్టుకుని వుంటాడు. అతన్ని తన్ని రివాల్వరు తీసుకోవటానికి, ఒక స్త్రీ వల్ల సాధ్యమయ్యేపని కాదని నా అభిప్రాయం!" అన్నాను.

"ఆ రోజులు పోయాయి. ఇప్పుడు ఆడవాళ్ళు, కరాటే, జూడో, అన్నీ నేర్చుకుంటున్నారు. మగ వాళ్ళను మించి వున్నారు," అన్నాడు నాయర్ భాయ్.

"ఇంతకు నీ వూహ ఏమిటి?"

"ఇంకా ఊహాగానం చెయ్యడం లేదు. రకరకాల క్లూలు దొరికాయి. ఏదో మా పరిశోధన చేస్తున్నాం" అన్నాడు నాయర్.

అతని దగ్గర సెలవు పుచ్చుకుని తిన్నగా రాజాచంద్ర గారింటికి వెళ్ళాను.

ఎప్పటిలాగే దర్వాన్ నన్ను అడ్డగించాడు. తర్వాత వెళ్ళి చెప్పివచ్చి, లోనికి పంపాడు.

మళ్ళీ డ్రాయింగ్ రూంలో నే లీలను కలుసుకున్నాను. ఈ మారు మరో కుర్చీలో నరేన్ వున్నాడు.

"ఏమిటి? మళ్ళీ వచ్చారు?" అడిగింది లీల. ఆమె కాస్త తేరుకొని వుంది.

"రాక తప్పలేదు! నా అశ్రద్ధ మూలంగా మీ వారు హత్య చెయ్యబడ్డారు. అందువల్ల వార్ని హత్యచేసిన మనుష్యుల్ని పట్టి పోలీసుల కప్పగించడమనేది నా కనీస కర్తవ్యంగా భావించాను. నా ప్రయత్నాలు నేను చేస్తున్నాను. చాలావరకు నా పరిశోధన ముగిసింది. రెండు మూడు చిన్నచిన్న వివరాలు మాత్రం తెలుసుకోవాలి. అవి తెలిస్తే హంతకుల్ని సులభంగా పట్టుకోగలను," అన్నాను.

"అంత సమర్థులా?" అడిగింది లీల ఎకసెక్కెంగా.

"మీరు నమ్మకపోవడానికి కారణం వుంది. నా సమర్థత మీకు ఋజువు చేసుకునేందుకే నా ప్రయత్నం!" అన్నాను.

"ఈ కేసులో మీరింక పని చెయ్యవద్దని చెప్పాక ఎందు కండీ తిరుగుతారు?" అడిగాడు నరేన్.

"మీ కెవరికన్నా నా పరిశోధనవల్ల నష్టంగానీ, కష్టం గానీ, కలుగుతుందంటే చెప్పండి, మానుకుంటాను" అన్నాను.

"మీ యిష్టం. మీతో సహకరించవలసిన అవసరం గత్యంతరం మాకు లేవు!" అన్నాడు నరేన్.

"అదే కరెక్టు!" అంది లీల.

"నా ఊహకు అతీతంగా లేదు మీ ప్రవర్తన. మీరిలా అంటారని ముందే అనుకున్నాను" అన్నాను.

"అంటే మీ ఉద్దేశ్యం?" అడిగింది లీల.

"ఈ హత్య మీరే చేయించి వుండాలి. లేదా చేసిం దెవరో మీకు తెలిసి, వాళ్ళు బాగా ఆత్మీయులు కావడం వల్ల, చిక్కుపడిపోతారేమోనన్న భయంతో, ఇటు నాతో గానీ, అటు పోలీసులతో గానీ, సహకరించడం మాను కున్నారు. పైగా తప్పుడు సాక్ష్యాలు చెప్పి, మమ్మల్ని తప్పుదోవల వెంట త్రిప్పుతున్నారు. ఈ నిజం నాయర్ కింకా తెలియలేదు!" అన్నాను.

లీల మాట్లాడలేదు.

నరేన్ ఆవేశంతో వూగిపోవడం గమనించాను.

"మీ రడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాను. నే చెప్పిన పని చెయ్యకున్నా మీకు ఫీజు ఇచ్చాను" అంది లీల.

"అవును. అదే ఇన్నాళ్ళూ ఆలోచించాను. మీరు పోలీసులపైన ఇంత నమ్మకంతో వున్నవాళ్ళు రెండు దినాల ముందు వాళ్ళ దగ్గరకు వెళ్ళకుండా నా దగ్గరకు ఎందుకు వచ్చారా అన్నదే అర్థంకాలేదు" అన్నాను.

"మీరు సమర్థులనుకుని నమ్మాను. అసమర్థులని ఋజువు చేసుకున్నారు. అందువల్ల మళ్ళీ మీ జోలికి రాలేదు" అంది లీల.

"మిస్టర్ సుధాకర్! ఎవర్ని పెట్టుకోవలసిందీ, మా కేసులు ఎలా నడుపుకోవలసింది మా యిష్టాయిష్టాలతో కూడినది. మధ్య మీ బలవంతం ఎందుకు?" అడిగాడు నరేన్.

"ఎందుకో ఇప్పుడు తెలీదు? తర్వాత తెలుస్తుంది. నాకు కొన్ని సందేహాలున్నాయి. అవి నివృత్తి చేయగలరా మేడమ్!" అడిగాను ఆమెను.

"ఏమిటి?"

"మీ వారికి హార్ట్ ఎటాక్ వచ్చిన మాట నిజమేనా?"

"నిజమే!"

"వారి ఆహారంలో కాజూ, బటానీలు, ఉప్పు, తీసి వెయ్యమని డాక్టరు చెప్పాడు కదూ!" అడిగాను.

"అవును!" అంది లీల.

"మీ వారు ఈగల్ బార్ కు బయలుదేరే ముందు ఫోన్ చేశారు. అతని డ్రస్సు వివరిస్తూ, టైకి స్వస్తిక్ షేపు పిన్ను పెట్టుకున్నాడని చెప్పారు. అవునా?"

"కాదు! ఆ పిన్ను విషయం చెప్పలేదు."

"పోలీసులు మిమ్మల్ని అడిగాక మార్చుకున్నారు."

"లేదు!"

"పోనివ్వండి. గ్లాస్ క్లబ్ నుంచి తిరిగి వచ్చేటప్పుడు మీ కారులో మీవారు లేరని నాకు తెలిసింది. మీరు ఒంటరిగానే తిరిగి యింటికొచ్చినట్లు చూచినవాళ్ళు చెప్పారు. మీ వారు ఎలా వచ్చారో చెప్పగలరా?"

"లేదు వార్ని నేనే కారులో తీసుకొచ్చాను. అలా

తీసుకొని రాకుంటే వారు తిరిగి ఈగిల్ బార్‌కు ఎలా వెళ్తారు? వారి డ్రెస్సు గురించి మీ కెలా ఫోన్ చేసి చెప్ప గలుగుతాను?" అంటూ ఎదురుప్రశ్నలు వేసింది.

"ఈ కేసులోని తిరకాసంతా ఇక్కడే వుంది" అంటూ తలదించాను లీల వేపు.

ఆమె కాళ్ళకున్న చెప్పులు కనుపించాయి. కళ్ళు మూసుకున్నాను. అలాంటి చెప్పులే ఆరోజు ఈగల్ బార్‌లో లావణ్య వేసుకుని వుండగా చూశాను. నాకు అక్కడి బార్, వాతావరణం గుర్తొచ్చింది. లావణ్య అడుగుల చప్పుడు గురుచేసుకున్నాను.

"థాంక్స్! వస్తాను" అన్నాను లేస్తూ.

"మళ్ళీ రానవసరం లేదు!" అన్నాడు నరేన్.

"బహుశా వుండదనే అనుకుంటున్నాన." అంటూ వెలుపలికొచ్చాను.

కారెక్కే దర్వాన్ దగ్గరకు రాగానే ఆగాను. అతను నమస్కారం చేశాడు. అతన్ని పిలిచాను. జేబులోంచి వందరూపాయల నోటుతీసి అతనికి కనుపించేట్లు పెట్టాను.

ఈమారు అతను దానికి నమస్కారం చేశాడు.

"ఇది ఇస్తాను. నా ప్రశ్నలకు జవాబు చెబుతావా?"

"అఁ!" అన్నాడు దర్వాన్.

"మీ అయ్యగారు చనిపోయిన రోజు ఉదయం హెరాల్డ్ కారులో ఎవరెవరు వెళ్ళారో గుర్తుందా?"

"అయ్యగారూ, అమ్మగారు వెళ్ళారు?"

"నరేన్ ఇంట్లోనే వున్నాడా?"

"లేదు! ఆ తర్వాత ఫియట్‌లో వెళ్ళిపోయారు. అమ్మ గారు రాబోయేముందు వచ్చారు."

"మీ అమ్మవారితో పాటు అయ్యగారు కూడా వచ్చారా?"

"రాలేదు!"

"బాగా గుర్తుచేసుకుని చెప్పు!"

"రాలేదు సార్!"

"ఐతే థియేటర్ లో మీ అయ్యగారు వెళ్ళడం చూశావా?"

"లేదండీ! ఇంపాలా కారు తుడవమని అమ్మగారు ఫోన్ లో చెప్పింది. ఆ పనిలో వుండిపోయాను. ఆలోగా అయ్యగారు వచ్చి వెళ్ళి వుండవచ్చు."

"నువ్వు కారు గారేజి దగ్గరే వున్నావుగా? నీకు తెలీకుండా మీ అయ్యగారు ఎలా వెళ్ళారు?" అడిగాను.

"ఆయన వెళ్ళిన కారు పోర్టికోలో వుంది." అన్నాడు దర్వాన్.

అతనికి వందరూపాయల నోటిచ్చి వెళ్ళిపోయాను.

10

నాయర్ దిగులుగా కూర్చుని వున్నాడు.

"ఏం భాయ్! నాకన్నా హుషారుగా వున్నావ్?" అడిగాడు నన్ను చూసి.

మారు మాట చెప్పకుండా ఫోన్ తీసుకొన్నాను. పోలీసు డాక్టరుకు రింగ్ చేసి మాట్లాడాను. ఆ తర్వాత రాజాచంద్ర గారి ఫామిలీ డాక్టరుతో మాట్లాడాను.

"ఏమిటా హడావుడి?"

"హంతకులు చిక్కారు?"

"హంతకులా? అంటే ఎంతమంది?" అడిగాడు నాయర్.

"ఇద్దరు!" అన్నాను.

"ఎవరు వాళ్ళు!"

"ఇంకెవరు! రాజాచంద్ర భార్య లీల, ఆమె మేనల్లుడు నరేన్!" అన్నాను.

"ఏమిటి ఆధారం?"

"ఆమె చెప్పులు. ఆమె నడక. అవి చేసే చప్పుడు. నాకు బాగా గుర్తు వున్నాయి. నా యింటికొచ్చినప్పటి అడుగుల శబ్దానికీ, బార్‌లో విన్న శబ్దానికి అణుమాత్రం కూడా తేడా లేదు" అన్నాను.

"ఇది కోర్టులో నిలవదు!"

"నరేన్‌కు ఆమెకూ సంబంధం వుంది. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుందా మనుకున్నారు. రాజాచంద్ర అడ్డు తొలగించుకుందా మనుకున్నారు. అందుకు తెలివైన పథకం వేశారు.

లావణ్య అనే ఒకామె వుందనే నమ్మకం కలిగించడం కోసం, నన్ను వాడుకుంది

క్లాస్ క్లబ్‌ను భర్తను తీసుకెళ్ళింది. గోల్ఫ్ ఆడుకునే ప్రాంతంల్లో వున్న చెట్లమధ్య నరేన్ కాచుకుని వుండి వుండాలి. అటురాగానే రాజాచంద్రను అతని రివాల్వర్‌తోనే కాల్చి చంపి శవాన్ని ఫియట్‌లోకి చేర్చివుండాలి. లీల తనకేం తెలీనట్లు హెరాల్డ్‌లో ఇంటికి చేరుకుంది.

నరేన్, రాజాచంద్రలాగా ముస్తాబై ఫియట్ తీసుకుని ఈగిల్ బార్ చేరుకున్నాడు. దొంగదోవన డ్రెస్ మార్చుకుని లీలకూడా అక్కడికి చేరుకుంది. నా కళ్ళకు కనుపించడానికి కాసేపు కూర్చున్నారు.

అక్కడే వాళ్ళు పప్పులో కాలేశారు. ఉప్పువేసి వేపి చేసిన కాజూ, బటానీలు తెగతిన్నాడు రాజాచంద్ర వేషంలో వున్న నరేన్. ఈ విషయం బార్‌లో వున్న బట్లర్ చెపుతాడు కావాలంటే.

రాజాచంద్ర హార్ట్ పేషంటు. అతను అవి తినకూడదు. నాలుగు సంవత్సరాల నుంచి వాటిని ముట్టుకోవడంలేదు.

అక్కడ్నించి కారెక్కారు. నేను వెంబడిస్తానని ఇద్దరికీ తెలుసు. అందుకని కొంతదూరం పోయాక నన్ను సులభంగా వదిలించుకున్నారు. శవాన్ని స్టీరింగు వీలు ముందు కూర్చోబెట్టి ఇద్దరూ చెరోదారిన ఇల్లు చేరుకున్నారు. ఇదీ జరిగిన కథ'' అన్నాను.

''అయితే నీకు రాజాచంద్ర, లావణ్య ఫోన్ చేశారన్నావ్?''

''చేశారు. నరేన్ రాజాచంద్రలా, లావణ్యలా లీల మాట్లాడారు. నేను ఖచ్చితంగా వాళ్ళను బార్‌లో చూడాలన్నదే వాళ్ళ ధ్యేయం. అక్కడే వాళ్ళు తప్పటడుగు వేశారు'' అన్నాను.

''ఇంకేమైనా సాక్ష్యాలు వున్నాయా?''

''రాజాచంద్ర వేసుకున్న సూటులాంటి మరో సూటు నరేన్‌కు వుండివుండాలి. టై పిన్నుమాత్రం దొరకలేదు. అందుకే ఆమె బుకాయించింది. నరేన్ బట్టలు బహుశా హెరాల్డ్ డిక్కీలో దొరుకుతాయి. ప్రయత్నించు'' అన్నాను.

''థాంక్స్! నీ పరిశోధన అమోఘం!'' అన్నాడు నాయర్.

తృప్తిగా సిగరెట్ పీల్చుకున్నాను. నన్ను ఇంకా అసమర్థుడిననే అంటుందా లీల? నవ్వుకున్నాను.

—: ఐపోయింది :—